

కమాన్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న గంగుల సతీమణి రజిత, ఎంపీపీ శ్రీలత



తీగలగుట్టపల్లిలో ప్రచారం చేస్తున్న జీకే యూత్ గౌరవాధ్యక్షుడు గంగుల ప్రదీప్

# జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

- ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించిన మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు



కొత్తపల్లి మండలం బద్దిపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించిన బీఆర్‌ఎస్ నాయకులు

కార్పొరేషన్, అక్టోబర్ 27: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే మంత్రి గంగుల కమలాకర్ బుధవారం బొమ్మకల్ గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించగా, అదే రోజు సాయంత్రం నగరంలోని కాపువాడలో ప్రచారం చేశారు. కాగా, మంత్రి కుటుంబ సభ్యులు మాత్రం గత ఐదారు రోజులుగా నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. గంగుల కమలాకర్ సతీమణి రజిత గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామంలో ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్‌తో కలిసి గంగుల కమలాకర్ సతీమణి రజిత ఇంటింటా ప్రచారం చేశారు. బద్దిపల్లి, ఎలగందుల గ్రామాల్లోనూ బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేశారు. కాగా, శుక్రవారం సాయంత్రం జీకేయూత్ గౌరవాధ్యక్షుడు గంగుల ప్రదీప్ నగరంలోని తీగలగుట్టపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి గంగుల కమలాకర్ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి, కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు.

కొత్తపల్లి, అక్టోబర్ 27: కమాన్‌పూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ మద్దతుగా ఆయన సతీమణి గంగుల రజిత ప్రచారం చేశారు. మొదట స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రచారాన్ని ప్రారంభించారు. ఎంపీపీ పిల్లి శ్రీలత-మహేశ్‌గౌడ్, జడ్పీటీసీ పిట్టల కరుణ, సర్పంచ్ జినుక సంపత్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. మంత్రి గంగుల కమలాకర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వివరించారు. కారు గుర్తుకే ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే, మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతుగా బద్దిపల్లి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మంత్రి గంగుల కమలాకర్‌ను నాలుగోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.



ఆర్మీ అధికారులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

## అత్యుత్తమ పదాతిదళం మనదే

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 27: ప్రపంచవ్యాప్త సైనిక దళాల్లోనే అత్యుత్తమ సైనంగా భారత పదాతిదళాలకు పేరుందని, తొమ్మిదో తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ డానియల్ లోడ్జెమ్ పేర్కొన్నారు. భారత పదాతి దళాల దినోత్సవం సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యుద్ధ సమయంలో ఇండియన్ ఇన్‌ఫాంట్రీ సేనలు శత్రువులను నేరుగా ఎదుర్కొంటూ విజయానికి కారణమవుతారని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా రెండో ఉప గవర్నర్ లయన్ సింహరాజు కోదండరామ్ మాట్లాడుతూ, భారత త్రివిధ దళాలను దేశ పౌర సమాజం సర్వదా కృతజ్ఞతాపూర్వకంగా ఉంటుందని, ముఖ్యంగా దేశం ఎదుర్కొన్న ఐదు యుద్ధాల్లో భారత పదాతిదళాల పాత్ర వెలకట్టలేనిదని చెప్పారు. కార్యక్రమ సమన్వయకర్త లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, భారత ఆర్మీలో ముఖ్య భాగమైన ఇన్‌ఫాంట్రీ సేనలు యుద్ధంలో ముందుండి శత్రువులతో నేరుగా పోరాడతారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కల్నల్ డానియల్ లోడ్జెమ్, ఎస్‌ఎం సాగర్ సింగ్, హవల్దార్ పదమ్ సింగ్‌ను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మనోహరాచారి, మహేందర్, లక్ష్మారెడ్డి, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు పీఆర్టీయూ నాయకుల వినతి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 27: అసెంబ్లీ ఎన్నికల్లో అనారోగ్యంతో ఉన్న, గర్భిణులు, ఫీడింగ్ మదర్స్ లాంటి వారికి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షుడు ముస్కు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ గోపికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అలాగే, దివ్యాంగులకు, ఉద్యోగ విరమణ ఆరు నెలల్లోపు ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందిస్తూ సీపీవోకు సిఫార్సు చేస్తూ, మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

## 2 నుంచి ఎల్‌ఎల్‌ఎం పరీక్షలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 27: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్‌ఎల్‌ఎం 2వ సెమిస్టర్ పరీక్షలు నవంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలు 2, 3వ తేదీల్లో ఉంటాయని, ఇందు కోసం పరీక్షా కేంద్రంగా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలను కేటాయించినట్లు వివరించారు.

## పరీక్ష ఫీజు చెల్లింపునకు 4వ తేదీ గడువు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 27: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష ఫీజు నవంబర్ 4వ తేదీలోగా చెల్లించాలని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ. 300 అపరాధ రుసుముతో నవంబర్ 8వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని వివరించారు.

## నేడు రాహుగ్రస్త చంద్రగ్రహణం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 27: ఆశ్వయుజ శుద్ధ పూర్ణిమ, శనివారం పాక్షిక రాహుగ్రస్త చంద్రగ్రహణం ఉండనుంది. గ్రహణ స్పర్శ కాలం రాత్రి 1.06 గంటల నుంచి ప్రారంభమైన మధ్య కాలం 1.44 నిమిషాలు, మోక్ష కాలం రాత్రి 2.25 నిమిషాలుగా ఉన్నట్లు పురోహితుడు మంగళంపల్లి శ్రీనివాస శర్మ పేర్కొన్నారు. ఆధ్యాత్మిక పరంగా గ్రహణ నియమాలు పాటించాలని పండితులు సూచించారు. శ్రాద్ధాది కార్యక్రమాలు, భోజనాలు గ్రహణ వేద కారణంగా శనివారం సాయంత్రం 4 గంటల వరకే ముగించుకోవాలన్నారు. కాగా, ఆలయాలను మధ్యాహ్నం 3 గంటల నుంచే మూసి వేసి ఆదివారం ఉదయం శుద్ధి అనంతరం పూజలు, దర్శనాలు నిర్వహించనున్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు ఖతమే

కలెక్టరేట్, అక్టోబర్ 27: తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే భవిష్యత్తులో కరెంటు సరఫరా ఎండమావిగా మారుతుందని తెలంగాణ రైతు సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎం నారాయణరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కోతిరాంపూర్‌లో గల ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీమాంధ్ర పాలకుల హయాంలో తెలంగాణ రైతులు అరిగోస పడ్డారని గుర్తు చేశారు. రైతుబంధును నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి మరో కుట్రకు కాంగ్రెస్ తెరలేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమంపై విషం చిమ్ముతున్న కాంగ్రెస్ అభ్యర్థులు, నాయకులను గ్రామాల నుంచి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ గెలిస్తే పెట్టుబడి సాయం పెంచడంతో పాటు రైతుల కుటుంబాలకు రూ.15లక్షల బీమా సౌకర్యం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించినట్లు వెల్లడించారు. రైతుల శ్రేయస్సు కోసం పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌ను తిరిగి గెలిపించుకునేందుకు రైతాంగం కలిసి కట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్‌ఎస్‌కే తెలంగాణ రైతు సంక్షేమ సమితి మద్దతు ఇస్తుందని ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు మండవ రాజేశ్వర్‌రావు, పేర్యాల రఘునాథరావు, కొమ్మెర భూపతిరెడ్డి, చల్ల రామకృష్ణ, తణుకు ఆంజనేయులు, కుమారస్వామి, తగరపు రాములు, బమ్మెర వెంకటేశం, రైతులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పేరు లేనివారు దరఖాస్తు చేసుకోవాలి

కార్పొరేషన్, అక్టోబర్ 27: ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటరు జాబితాలో పేరు లేని వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ఉన్న జాబితాలో ఓటర్ల ఇంటి దూరంగా పోలింగ్ బూత్‌లు వచ్చాయని, కొందరి పేర్లు తొలగించినట్లు పేర్కొన్నారు. ఓటర్లు జాబితాను చూసుకొని పోలింగ్ బూత్ దూరంగా ఉంటే మార్పు కోసం, పేరు లేకపోతే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటింటికీ వచ్చే బీఆర్‌ఎస్ కార్యకర్తల వద్ద జాబితా ఉందని, పేరు ఉందో లేదో చూసుకోవాలని కోరారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# కర్ణాటక దంపతులకు బాలుడి దత్తత



దత్తత ఉత్తర్వు పత్రం అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ బీ గోపి

- ఉత్తర్వు పత్రం అందజేసిన కలెక్టర్ డాక్టర్ బీ గోపి

కలెక్టరేట్, అక్టోబర్ 27: నగరంలోని బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న పదిహేనేళ్ల బాలుడిని కర్ణాటక దంపతులు దత్తత తీసుకున్నారు. స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ, కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో దత్తత కార్యక్రమం నిర్వహించగా, శుక్రవారం ఆ దంపతులకు కలెక్టర్ డాక్టర్ బీ గోపి దత్తత ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి వచ్చిన వారు మాట్లాడుతూ, బాబు తమ ఇంట్లో అడుగుపెట్టినప్పటి నుంచి సంతోషంగా ఉన్నట్లు వెల్లడించారు. బాబును సీబీఎస్ఈ ప్యాటర్న్‌లో 9వ తరగతిలో చేర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి, డీసీపీవో శాంత, ఐసీపీఎస్ సిబ్బంది తిరుపతి, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## స్మృతివాటిక, అమరవీరుల స్తూపం నిర్మాణానికి మట్టి సేకరణ

కొత్తపల్లి, అక్టోబర్ 27: నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవం, మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సేకరించిన మట్టిని ఢిల్లీలో వీర జవాన్లు, స్వాతంత్ర్య సమరయోధుల స్తూప నిర్మాణంలో వినియోగించేందుకు తీసుకెళ్లినట్లు ఎన్‌వైకే ప్రోగ్రాం అధికారి రవీందర్ పేర్కొన్నారు. సేకరించిన మట్టిని 33 కలశాల్లో కరీంనగర్‌లోని యువ కేంద్ర కార్యాలయం నుంచి 19 మంది వలంటీర్లు, మాజీ వలంటీర్లు, యువజన సంఘాల ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం ప్రతినిధులు శనివారం ఉదయం ప్రత్యేక రైలులో ఢిల్లీకి బయలుదేరుతారని పేర్కొన్నారు. తరలివెళ్లిన వారిలో తొర్తి శ్రీనివాస్, ఎం హరీశ్, ఎన్ సాయిచరణ్, సింధు, శివకుమార్, ఎస్ రాకేశ్, ఎస్ గుణశేఖర్, పవన్ కళ్యాణ్, రాకేశ్, ఎం కుమార్, ఆర్ సాయిచరణ్, గంగాధర్, రాధిక, ఎస్ శ్రీరాం, ఆర్ మహేశ్, వాణి, ఆర్ శ్రీకాంత్, సాయి వరప్రసాద్, అభినయశ్రీ తదితరులున్నారు.

## దవాఖానలో అన్నదానం

కార్పొరేషన్, అక్టోబర్ 27: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ మానేరు ఆధ్వర్యంలో మానేరు లయన్స్ క్లబ్ సభ్యుడు ముత్యం శంకర్ గౌడ్ తండ్రి వీరయ్య గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో శుక్రవారం 300 మందికి అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మానేరు సభ్యులు గుండా రాజశేఖర్, రావికంటి కృష్ణ కిశోర్, వేముల విష్ణుమూర్తి, పడమటింటి రమేశ్, జిల్ల కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమూద్ బాషా, మోహన్ రెడ్డి, ఇరుకుల్ల వార్డు సభ్యులు సంపత్, సతీశ్, దిలీప్, శ్రావణ్ పాల్గొన్నారు.